నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
10 నల్లగొండ, శుక్రవారం 20 జూన్ 2025
YADADRI BHUVANAGIRI

## త్రిఫ్ట్ ఫండ్ గడువు పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

నల్లగొండ, జూన్ 19: నేత కార్మికుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన త్రిఫ్ట్ ఫండ్ పథకం గడవు పెంచాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జౌళి శాఖ అధికారికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ మాట్లాడుతూ.. కొత్త బ్యాంకు ఖాతాల విషయంలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున జౌళి శాఖ అధికారులు బ్యాంకర్లతో మాట్లాడి నేత కార్మికులు నివాసముండే ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి బ్యాంకు ఖాతాలు తీయాలని కోరారు. త్రిఫ్ట్ ఫండ్ పథకం గడువు ముగియటంతో జిల్లాలోని 15వేల మంది నేత కార్మికులు ఎంతో నిరాశ చెందుతున్నట్లు తెలిపారు. వారిని నిరాశపర్చకుండా ఈ పథకం గడువు మరో నెల రోజులు పొడిగించి నేత కార్మికులను ఆదుకోవాలన్నారు. వినతి పత్రం అందచేసిన వారిలో చెరుపల్లి జయప్రకాశ్, గంజి రాజేందర్, మిర్యాల కిరణ్ కుమార్, గంజి లక్ష్మీనారాయణ, జెల్ల శ్రీనివాసులు, ఆంజనేయులు ఉన్నారు.

## భవిత కేంద్రాల్లో పిల్లల పేర్లు నమోదు చేయాలి



భవితకేంద్రంలో చిన్నారికి చాక్లెట్ అందిస్తున్న కలెక్టర్

మిర్యాలగూడ, జూన్ 19: భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పేర్లు నమోదు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు కృత్యాధార పద్ధతుల్లో విద్యాబోధన జరుగుతుందన్నారు. వారి మానసికపరమైన లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు తదుపరి విడతలో విద్యాశాఖ ద్వారా పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలోని భవిత కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దడంపై సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌ను, విద్యాశాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. ఆమె వెంట డీఈవో భిక్షపతి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# జీవోలను సవరించాలి

**టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్ డిమాండ్**



టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దేవాదాయ శాఖ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ రమేశ్ బాబు


యాదగిరిగుట్ట, జూన్ 19: దేవాదాయ శాఖలో ఉన్న పోస్టులకు అనుగుణంగా జీవో నంబర్ 888, జీవో నంబర్ 261లను సవరించాలని టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్ డిమాండ్ చేశారు. గురువారం పాత గోశాల లక్ష్మీనరసింహస్వామివారి ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర దేవాదాయ ఉద్యోగుల జేఏసీ చైర్మ న్ గజవెల్లి రమేశ్ బాబు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా 5 సమస్యలతో కూడిన ఎజెండాను ఆమోదించారు. కార్యక్రమానికి మారం జగదీశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రధాన ఆలయాల ఉద్యోగులకు హెల్త్‌కార్డులు, పీఆర్సీ తదితరాలను ప్రభుత్వ జీవోల్లో పొందుపర్చాలన్నారు. ఉద్యో గ విరమణకు దగ్గరలో ఉన్న ఉద్యోగులతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులను తిరిగి మాతృ సంస్థలకు బదిలీ చేయాలన్నారు. ప్రధాన ఆలయాల్లో పనిభారం తగ్గించేందుకు అవసరం మేరకు క్యాడర్ స్ట్రెంత్‌ను అనుమతిస్తూ ఖాళీగా ఉన్న పోస్టులను రెగ్యులర్ పద్ధతిలో నియమించాలన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. అన్ని ఆలయాల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనను దేవాదాయ శాఖ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ రమేశ్‌బాబు స్వామివారి ప్రసాదం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి ముజీబ్, టీజీవో జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ముక్కర్ల సత్యనారాయణ, కస్తూరి వెంకటేశ్వర్లు, ఆలయాల అధ్యక్షులు శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్ గౌడ్, చందు, మల్లికార్జున శర్మ, జూశెట్టి కృష్ణ, దయానంద్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఆర్‌కు ట్రబుల్..!

## నోటీసుల స్వీకరణకు రైతులు 'నో'

ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టులో భాగంగా భువనగిరి జిల్లాలో నోటీసుల పరంపర కొనసాగుతున్నది. ఓ వైపు అధికారులు నోటీసులు జారీ చేస్తుంటే.. మరో వైపు నిర్వాసితులైన రైతులు వాటిని తిరస్కరిస్తున్నారు. అంతటితో ఆగకుండా తిరిగి అధికారులకే నోటీసులు పంపిస్తున్నారు. తమకు సరైన ప్యాకేజీ ఇవ్వకుంటే భూమి ఇచ్చేది లేదంటూ కుండబద్దలు కొడుతున్నారు.

- సరైన ప్యాకేజీ ఇవ్వకుంటే భూమి ఇచ్చేది లేదంటూ తేల్చిచెబుతున్న రైతులు
- చౌటుప్పల్ ఆర్డీవో పరిధిలో ట్రిపుల్ ఆర్‌కు రైతుల నిరాకరణ
- తిరిగి ఆర్డీవోకే బాధితుల లేఖ
- భూమి ఇవ్వడంలేదంటూ లేఖలో స్పష్టీకరణ
- 3ఈ నోటీసుల జారీకి అధికారుల ప్లాన్
- తర్వాత భూములు స్వాధీనం చేసుకునే యోచన




యాదాద్రి భువనగిరి, జూన్ 19 (నమస్తే తెలంగాణ): అధికారులు మాత్రం 3ఈ నోటీసులు ఇచ్చి భూములు తీసుకుంటామని చెబుతున్నారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్‌ను ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించారు. ఉత్తర భాగంలో జిల్లా మీదుగా 59.33 కిలోమీటర్ల రోడ్డును నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దీని పరిధిలోకి తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 1775 ఎకరాల భూమిని సేకరించనున్నారు. అయితే పరిహారం విషయంలో రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కోట్లు విలువ చేసే భూములు పోతున్నాయని, మంచి ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం రూరల్ అయితే రిజిస్ట్రేషన్ విలువకు మూడు రెట్లు, మున్సిపాలిటీ అయితే రెండు రెట్లు పరిహారం చెల్లించాలని భావిస్తున్నది. దీనికి బాధిత రైతులు ఒప్పుకోవడంలేదు.

### ఇటు నోటీసులు.. అటు లేఖలు..

జిల్లాలోని చౌటుప్పల్ ఆర్డీవో పరిధిలో ట్రిపుల్ ఆర్ ప్రక్రియ వేగంగా జరుగుతున్నది. ఇందులో భాగంగా ఇటీవల 250 మంది నిర్వాసితులకు ఆర్డీవో శేఖర్ రెడ్డి పేరుతో నోటీసులు జారీ చేశారు. కానీ కొందరు బాధితులు మాత్రం నోటీసులకు తీసుకోకుండా తిరస్కరించారు. అంతే కాకుండా కొందరు రైతులు ఆర్డీవోను స్వయంగా కలిసి లేఖలు అందించారు. ''భూమి జీవనోపాధి ద్వారా జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుత మార్కెట్ విలువైన 1.20 కోట్లు పరిహారం అందించండి. లేదంటే భూమికి భూమి ఇవ్వండి. సర్కారు ప్రకటించిన పరిహారం సరిపోవడంలేదు. కాబట్టి మా భూములు ఇవ్వడంలేదు.'' అంటూ లేఖలు రాశారు.

### త్వరలో 3ఈ నోటీసులు..!

ఇటీవల అధికారులు 3హెచ్ (2) నోటీసులను బాధి రైతులకు జారీ చేశారు. అవసరమైన ధృవ పత్రాలు తీసుకొని రావాలని అందులో పేర్కొన్నారు. కానీ కొందరు రైతులు వ్యతిరేకించడంతో అధికారులు త్వరలో 3ఈ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలుస్తున్నది. నోటీసుల జారీ తర్వాత తొలుత బాధితుల భూమికి సంబంధించి ప్యాకేజీ డబ్బులు భూమి రాశి పోర్టల్‌లో జమ చేయనున్నారు. దీనికి ఎలాంటి వడ్డీ కూడా ఉండదు. ఆ తర్వాత భూమిని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది.

### 'భువనగిరి' అవార్డు పెండింగ్..

జిల్లాలోని యాదగిరిగుట్ట, తుర్కపల్లి, వలిగొండ, చౌటుప్పల్‌కు సంబంధించి బాధితులకు అవార్డు ఇప్పటికే ఆమోదం పొందింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే సుమారు 130 ఎకరాలకు 20 కోట్లతో అవార్డు పాసైంది. అప్పటి నుంచి వడ్డీతో సహా పరిహారం చెల్లించాల్సి ఉంది. కానీ భువనగిరి పరిధిలో మాత్రం అవార్డు పెండింగ్‌లో ఉంది. ఇక్కడ గతంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు జరగడం, సర్వేకు రైతులు సహకరించకపోవడం, హైకోర్టును ఆశ్రయించడంతో అవార్డు ఇంకా పూర్తి కాలేదు. మరోవైపు పరిహారంలో భూములు, ఇండ్లతోపాటు చెట్లు, చేమలకు కూడా డబ్బు చెల్లించనున్నారు.


Date: 16-06-2025

To
The Revenue Divisional Officer
Land Acquisition Officer,
Choutuppal Mandal,
Yadadri-Bhuvanagiri Dist., T.G.

OBJECTION FILED UNDER SECTION 15 OF THE RIGHT TO FAIR COMPENSATION AND TRANSPARENCY IN LAND ACQUSITION REHABILITATION AND RE-SETTLEMENT ACT,2013. ("2013 Act")

Sir,

Sub: Acquisition of lands to an extent of Ac: 04-28 Guntas, in [illegible] City. Vide Notification in File No.G2/1062/2018, Dated: 24-07-2018 as published in the News Papers Dt. 21-08-2018

1. I state that vide above notification the State Government alleged to have appointed you as Land Acquisition Officer to acquire the lands to an extent of Ac: 04-28 Guntas, in various Survey No's including this objector's Land.

2. గోకారం, వర్కట్‌పల్లి గ్రామ రైతులు ఆర్.ఆర్.ఆర్. భూబాధితులు రైతులు [illegible] ఒక కోటి ఇరవై లక్షల (1.20 లక్షలు) లేకుంటే భూమికి భూమి [illegible]

ఇట్లు,
వర్కట్‌పల్లి, గోకారం.
ఆర్.ఆర్.ఆర్. రైతులు

ఆర్డీవోకు లేఖ రాసిన వలిగొండ మండలం వర్కట్‌పల్లి భూబాధితులు



తహసీల్దార్ అంజిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కొండమడుగు నర్సింహ

# భూమిలో రాళ్లు పోసిన వారిపై చర్యలు తీసుకోవాలి



విలేకరులలో మాట్లాడుతున్న బాధితులు

నల్లగొండ సిటీ, జూన్ 19: అక్రమంగా తమ వ్యవసాయ భూమిలో రాత్రి సమయంలో రాళ్లు పోసిన వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని కనగల్ మండలం రేగట్టె గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు ఉడతల పార్వతమ్మ,యాదగిరి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కనగల్ మండలం రేగట్టె రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 142,158 సర్వే నెంబర్‌లో తమకు వ్యవసాయ భూమి ఉందని, ఆ భూమిని 1975 నుంచి సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. కొన్నేండ్ల క్రితం పక్క భూమి యజమాని గుంటకాడి ఈదయ్య తన వ్యవసాయ భూమిని ఈరమ్మయాదగిరికి విక్రయించడానికి నిర్ణయించుకున్నాడు. వారి భూమికి దారి లేకపోవడంతో తమ భూమిలో దారికి కొంత ఇవ్వాలని కోరారు. దారికి ఇచ్చిన భూమికి బదులు వేరే ప్రాంతంలో భూమి ఇస్తానని నమ్మబలికి యాదగిరికి భూమిని విక్రయించాడు. కానీ తమకు వేరే ప్రాంతంలో ఇస్తామన్న భూమి ఇవ్వకపోవడంతోపాటు భూమి కొనుగోలు చేసిన యాదగిరి రాత్రి సమయంలో తమ వ్యవసాయ భూమిలో రాళ్లు పోస్తున్నారు. ఇది సరైందికాదని అగితే తమపై దాడికి ప్రయత్నించినట్లు తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వృద్ధదంపతులు కోరారు.

# అధికారులతో రైతుల లడాయి..

**రాయగిరిలో రసాభాసగా భూభారతి రెవెన్యూ సదస్సు**

**రెవెన్యూ అధికారులను నిలదీసిన వడాయిగూడెం గ్రామస్తులు**

భువనగిరి కలెక్టరేట్, జూన్ 19 : ప్రభుత్వం భూసమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సు రసాభాసగా మారింది. ఏండ్ల నుంచి ఉన్న సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలంటూ రెవెన్యూ అధికారులను గ్రామస్తులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. వివరాల్లోకి వెళితే పట్టణ పరిధిలోని రాయగిరిలో గురువారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వడాయిగూడెం గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గ్రామంలోని 518 సర్వేనెంబరులోని వందలాది ఎకరాల భూమి పూర్తిగా భూదాన్ భూమిగా నమోదైందని వారు పేర్కొన్నారు. భూదాన్ భూమిగా నమోదు కావడంతో గ్రామస్తులుకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకం ఏవీ వర్తించడంలేదని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కండ్ల ముందు ఉన్న భూమి తమకు కాకుండా పోయిందంటూ వారు ఆందోళన చేశారు. వెంటనే రికార్డుల నుంచి 518 సర్వేనంబరుకు మినహాయింపు కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. స్పందించిన తహసీల్దార్ అంజిరెడ్డి మాట్లాడుతూ 518లో ఉన్న భూమి భూదాన్ భూమి అని, తమ పరిధిలో లేదని తెలియజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### పరిష్కారం చూపాలి

రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతు భూసమస్యను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం రాయగిరిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ అంజిరెడ్డికి వినతి పత్రం అందజేసి రెవెన్యూ సదస్సుల్లో వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోలేని రైతులకు మరోమారు అవకాశం కల్పించాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వివిధ గ్రామాల రైతులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రమేశ్

## సైబర్ నేరాలపై తక్షణమే స్పందించాలి

నల్లగొండ సిటీ, జూన్ 19 : సైబర్ నేరాలపై ఫిర్యాదు అందిన వెంటనే సైబర్ వారియర్స్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ రమేశ్ సూచించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్‌క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ల వారీగా నియమించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సైబర్ నేరాలపై నమోదైన కేసుల్లో ఫ్రీజ్ అయిన డబ్బును బాధితులకు తిరిగి అందజేసేందుకు చేపట్టిన చర్యలపై శిక్షణ నిర్వహించామన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల జనం అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు నుంచి వచ్చే లింకులు,మేసేజ్‌లను పట్టించుకోవద్దని నకిలీ వెబ్ సైట్ల ద్వారా అమాయకులను నమ్మించి వారి వద్ద నుంచి డబ్బులు గుంజుతారన్నారు. లోన్ యాప్ అంటూ సులభంగా లోన్లు ఇస్తూ అధిక వడ్డీలు వసూలు చేస్తూ డేటా మొత్తం తమ ఆధీనంలోకి తీసుకుని ఇబ్బందులకు గురిచేస్తారని, ఇలాంటి యాప్‌లను డౌన్లోడ్ చేయరాదన్నారు. ఎవరైనా ఇలాంటి మోసాలకు గురైతే వెంటనే సైబర్‌క్రైం పోలీసులను సంప్రదించాలన్నారు.

# ఘనంగా యోగా డే నిర్వహించాలి

**వీసీ ప్రొ. ఖాజా అల్తాఫ్ హుస్సేన్**



యోగా దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంజీయూ వీసీ ప్రొ. హుస్సేన్

రామగిరి, జూన్ 19: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించాలని ఎంజీయూ వీసీ ప్రొ. ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సూచించారు. వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే యోగా దినోత్సవ పోస్టర్లను గురువారం వీసీ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గత వారం రోజులుగా యోగాలో శిక్షణ ఇవ్వడం అభినందనీయమంటూ యూనిట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా. నీలకంఠం శేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. మద్దిలేటి, పీవో డా. నీలకంఠం శేఖర్, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్, వివిధ యూనిట్స్ పీవోలు పాల్గొన్నారు. ఎంజీయూలో 21న 'నేటి మీడియా' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.అల్వాల రవి తెలిపారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆదర్శం

**పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన టీచర్ యాదయ్య**



పీఏపల్లి ప్రాథమిక పాఠశాలలో తన పిల్లలను చేర్పిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు యాదయ్య

పెద్దఅడిశర్లపల్లి జూన్ 19: ప్రభుత్వ పాఠశాలలపై రోజురోజుకూ నమ్మకం సన్నగిల్లుతున్న ప్రస్తుత తరుణంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆదర్శంగా నిలిచారు. పీఏపల్లి మండల జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఉరిమళ్ల యాదయ్య తన పిల్లలను పీఏపల్లి ప్రాథమిక పాఠశాలలో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

# సొంత డబ్బా ..పరనింద

- వాసాలమర్రిలో మంత్రి పొంగులేటి ప్రసంగంపై గ్రామస్తుల స్పందన
- గ్రామంలోని మౌలిక వసతుల ఊసేలేదు
- ఇండ్ల మంజూరు పత్రాలు రాలేదంటూ స్థానిక నేతలను నిలదీసిన మహిళలు



వాసాలమర్రిలో మాట్లాడుతున్న రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

తుర్కపల్లి, జూన్ 19: గ్రామాభివృద్ధికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిధుల వరద పారిస్తారని ఎంతో ఆశతో ఎదురు చూసిన వాసాలమర్రి గ్రామస్తుల ఆశలు అడియాసలయ్యాయి. గ్రామంలో మౌలికవసతుల కల్పనకు నిధులు ప్రకటిస్తారని చూసిన గ్రామస్తులకు నిరాశే మిగిలింది. తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో గురువారం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామంలో అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని పదేపదే ప్రకటించి కొంతమందికే మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. దీంతో జాబితాలో తమ పేర్లు లేవంటూ మహిళలు స్థానిక కాంగ్రెస్ నేతలను నిలదీశా . తమకు అనుకూలమైన వారికే ఇండ్ల మంజూరు పత్రాలు ఇప్పించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌ను మంత్రి పొంగులేటి పదేపదే విమర్శిస్తున్న సమయంలో మహిళలు, గ్రామస్తుల నుంచి ఎలాంటి స్పందన లేదు. మంత్రి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న సమయంలో స్థానిక ఎమ్మెల్యే, నాయకులు పదేపదే చప్పట్లు కొట్టాలని విన్నవించినా ప్రజల నుంచి స్పందన కరువైంది. మంత్రి ప్రసంగం మొత్తం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురద చల్లడంతోపాటు తమ ప్రభుత్వ గొప్పలు చెబుతూ డబ్బా కొట్టుకోవడంతోనే సరిపోయింది. సమావేశంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన మంత్రి

భువనగిరి కలెక్టరేట్, జూన్ 19: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకాన్ని గురువారం మండలంలోని బండసోమారం గ్రామంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ చీరలు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ నానాం పద్మ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం..

మోతె, జూన్ 19: మోతె మండలం విభళాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామంలో 146 ఇండ్లు మంజూరు చేయగా 74 ఇండ్ల పనులు మొదలు పెట్టి వివిధ దశల్లో కొనసాగుతున్నాయన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి మాట్లాడుతూ లబ్ధిదారుల కుటుంబాలకు చీరలు పంపిణీ చేసినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్, పౌర సంబంధాల శాఖ ఆర్డీవో వేణు మాధవరావు, హౌసింగ్ పీడీ ధర్మారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ సీతారాంనాయక్, తహసీల్దార్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.